బాలానంద బొమ్మల

# జానపద కథలు




398.6
జగదీ - భాలన
128579

జగదీ - భాలన
128579

పెండెం జగదీశ్వర్

# క్షీణ సంస్కృతికి కారకులెవరు?

వల్లికణ్ణన్

విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్,
4–1 435, విజ్ఞానభవన్, బ్యాంక్ స్ట్రీట్,
హైదరాబాదు - 500 001

# బాలానంద బొమ్మల

# జానపద కథలు

రచయిత :
పెండెం జగదీశ్వర్

**నవరత్న బుక్ హౌస్**

28-22-20, రహిమాన్ వీధి,

అరండల్‌పేట, విజయవాడ - 520 002.

బాలానంద బొమ్మల
**జానపద కథలు**

ప్రథమ ముద్రణ :
**జూన్ - 2005**

ముఖచిత్రం :
**చైతన్య**

ప్రచురణ హక్కులు :
**నవరత్న బుక్ హౌస్**
**సెల్: 9848082432**

టైప్ సెట్టింగ్ :
**శ్రీ సూర్యా గ్రాఫిక్స్**
విజయవాడ-2

ముద్రణ :
**నాగేంద్ర ఎంటర్‌ప్రైజెస్**
విజయవాడ-2

**వెల: రూ. 30-00**

ACC. NO. 178579
398.21
C. 82368

# విషయసూచిక

1. తెలివైన పిల్లవాడు
2. మతిమరుపు అల్లుడు
3. పేదవాడు-దేవత
4. పొట్టివాడు-ధనవంతుడు
5. పగటికలలు
6. దొరికిన దొంగ
7. మూర్ఖుడైన రాజు
8. భార్యాభర్తల పందెం
9. ఐదుగురు మిత్రులు
10. కోతి దప్పు
11. ఉల్లిగడ్డ ఏడుపు
12. ముసలమ్మ దురాశ
13. ఏడుగురు అక్కా చెల్లెళ్ళ కథ
14. పెద్దరాణి-చిన్నరాణి
15. కాయగూరల కథ
16. బంగారు వెంట్రుకలు పిల్లవాడు
17. బలహీనుని యుక్తి
18. మంగళం కృష్టా - చాకలి కృష్టా
19. ఏడు చేపల కథ

## జానపద కథల గురించి ........

జనపదం అంటే పల్లెటూరు. ఈ పల్లెటూర్లలో చెప్పుకునే కథలే జానపద కథలు. ఈ కథల రచయితలు ఎవరో మనకు తెలియదు. కొన్ని వేల సంవత్సరాలుగా ఇవి ప్రచారంలో ఉంటూ వస్తున్నాయి. ఒక తరం నుండి మరొక తరానికి అందించబడుతున్నాయి.

జానపద కథలు మనిషికి వినోదంతోపాటు బుద్ధి వికాసాన్ని కలిగిస్తాయి. దయ్యాలు, భూతాలు, రాక్షసులు, మంత్రతంత్రాలు ఇలా అనేకానేక అంశాలతో నిండి ఉన్న కథలు వినేవారిని, చదివేవారిని కట్టి పడేస్తాయి. నిజ జీవితంలో సాధ్యం కాని సంఘటనలు వీటిలో నెలకొని ఉంటాయి. నిర్జీవ పాత్రలుంటాయి. మాట్లాడతాయి.

భావం ఒకటే అయినా మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో వివిధ రకాలుగా ఈ కథలు చెప్పుకుంటారు. ఇక్కడ మనం చెప్పుకునే కథల్ని ఇతర రాష్ట్రాలలోనూ, దేశాలలోనూ మార్పులూ, చేర్పులతో చెప్పుకుంటారు. అందువల్ల జానపద కథల పుట్టుక ఎక్కడ అనేది స్పష్టంగా తెలియదు. ఇవి విశ్వజనీనమైనవి.


పెండెం జగదీశ్వర్
ఇం. నెం. 8-21/13, క్రిస్టియన్ కాలని
రామన్నపేట - 508 113, నల్లగొండ జిల్లా.

# తెలివైన పిల్లవాడు

**ఒ**క ఊరిలో ఒకావిడ ఉండేది ఆమెకు ఒక కొడుకు ఉండేవాడు. ఒకరోజు అతడు ఆమె దగ్గర పది పైసలు తీసుకొని కోమటి దుకాణానికి వెళ్లాడు ఆ దుకాణంలో లడ్డూలు, జిలేబీలు ఉన్నాయి వాటిని చూడగానే అతనికి నోరూరింది. ఎలాగైనా వాటినన్నింటిని తినాలనుకున్నాడు.

ముందుగా కోమటికి పది పైసలు ఇచ్చి ఒక జిలేబి ఇవ్వమన్నాడు. దానిని తిన్న తరువాత మిగిలిన అన్ని జిలేబీలను, లడ్డూలను పొట్లం కట్టి ఇవ్వమన్నాడు కోమటి అలాగే ఇచ్చాడు. పిల్లవాడు ఆ పొట్లం తీసుకుని వెళ్ళబోయాడు. కోమటి డబ్బులు ఇవ్వమని అడిగాడు. అందుకు పిల్లవాడు "నేను ఇవ్వను" అన్నాడు.

కోమటికి కోపం వచ్చింది. "నీ పేరేమిటి" అని అడిగాడు. దానికి పిల్లవాడు "నా పేరు అప్పులవాడు" అని చెప్పి పొట్లంతో పరుగెత్తాడు. కోమటి "అయ్యో ! అయ్యో ! నా జిలేబీలు, లడ్డూలు ఎత్తుకుపోతున్నాడు. వాడ్ని "ఆపండి" అని అరవసాగాడు. జనం గుమిగూడారు. "వాని పేరేమిటి" అని అడిగారు. "అప్పులవాడు" అని చెప్పాడు కోమటి అందుకు జనం "నువ్వు అప్పు తీర్చలేదు కాబట్టి ఎత్తుకు పోతున్నాడు. ఇందులో అతని తప్పేం ఉంది" అని వెళ్ళిపోయారు. కోమటి లబోదిబోమని మొత్తుకున్నాడు, ఏమీ చేయలేకపోయాడు.



పిల్లవాడు చెరువు దగ్గరకు వెళ్ళి కూర్చుని జిలేబీలు, లడ్డూలు తినసాగాడు. అక్కడ బట్టలు ఉతుకుతున్న చాకలివాళ్ళు అతనితో "నీ వద్ద ఇన్ని జిలేబీలు, లడ్డూలు ఎక్కడివి ?" అని అడిగారు. అందుకు అతడు "ప్రక్క ఊరిలో అందరికీ పంచి పెడుతున్నారు మీరు కూడా వెళ్ళండి" అన్నాడు. చాకలివాళ్ళకు ఆశ పుట్టింది. వాళ్ళు "నీ పేరు ఏమిటి" అని అడిగారు. "గాలి దేవుడు" అని చెప్పాడు పిల్లవాడు "ఐతే నువ్వు మా బట్టలను చూస్తూ ఉండు మేం వెళ్ళి జిలేబీలు, లడ్డూలు తెచ్చుకుంటాం" అని చెప్పి చాకలి వాళ్ళంతా పక్క ఊరివైపు పరుగులు తీశారు.

పిల్లవాడు తినడం పూర్తికాగానే చాకలివాళ్ళు వదిలి వెళ్ళిన బట్టలను మూటగట్టుకుని అక్కడి నుండి ఉడాయించాడు. చాకలివాళ్ళు తిరిగి వచ్చి జరిగిన మోసం తెలుసుకుని ఏడవడం మొదలుపెట్టారు కొంతమంది జనం వచ్చి "ఏం జరిగిందని అడిగారు." గాలి దేవుడు వచ్చి మా బట్టలన్నీ ఎత్తుకుపోయాడు" అని చెప్పారు చాకలివాళ్ళు. దానికి జనం "గాలి వస్తే బట్టలు ఎగిరిపోక అలాగే ఉంటాయా !" అని వెళ్ళిపోయారు. చాకలివాళ్ళు కూడా ఏమీ చేయలేకపోయారు.

పిల్లవాడు ఒక నది ఒడ్డుకు వెళ్ళాడు. అక్కడ ఒక ముసలమ్మ తన మనవరాలుతో నిలబడి ఉంది. ముసలమ్మ పిల్లవానితో "నన్నూ నా మనవరాలిని పడవలో నది దాటించు బాబూ !" అని అడిగింది. అందుకు పిల్లవాడు "ముందు నీ మనవరాలిని దాటిస్తాను" ఆ తర్వాత నిన్ను దాటిస్తాను" అన్నాడు అందుకు ముసలమ్మ ఒప్పుకుంది. "నీ పేరేమిటి" అని అడిగింది. "మొగుడు" అని చెప్పాడు పిల్లవాడు. మనవరాలిని తీసుకుని పడవలో నది దాటిన పిల్లవాడు ఆమెను తన ఇంటికి తీసుకు వెళ్ళాడు. నది అవతల ఉన్న ముసలమ్మ నా మనవరాలిని తీసుకుపోయాడు నాయనో !" అంటూ ఏడవడం ప్రారంభించింది. జనం గుమిగూడి "ఎవరు" అని అడిగారు. "మొగుడు" అని చెప్పింది ముసలమ్మ. దానికి జనం "ఆ అమ్మాయి మొగుడు ఆమెను తీసుకెళ్ళాడు ఏడుస్తావెందుకు" అని వెళ్ళిపోయారు. పాపం ముసలమ్మ కూడా ఏం చేయలేకపోయింది.

పిల్లవాడు ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. సుఖంగా జీవించాడు. ★

# మతిమరుపు అల్లుడు

**ఒ**క ఊరిలో ఒకతను ఉండేవాడు. అతనికి మతిమరుపు ఎక్కువ. ఒకసారి అత్తవారింటికి వెళ్ళాడు. అల్లుడు వచ్చినందుకు అత్త చాలా సంతోషపడి అతనికి పూరీలు చేసి పెట్టింది. అవి చాలా రుచిగా ఉండడంతో అల్లుడు పది పదిహేను తిన్నాడు. తన భార్య చేత కూడా అవి తయారు చేయించాలనుకున్నాడు. ఐతే ఇంతకుముందెప్పుడూ అతడు వాటిని తినలేదు.

అల్లుడు అత్తతో "అత్తా ! ఇవి చాలా రుచిగా ఉన్నాయి. ఇంటికి వెళ్ళినాక మీ కూతురుని చేయమని అడుగుతాను. వీటి పేరేమిటో చెప్పు" అని అడిగాడు. అందుకు అత్త "వీటిని పూరీలు అంటారు." అని చెప్పింది. తనకు మతిమరుపు కాబట్టి ఎక్కడ మరిచిపోతానో అనుకుని అల్లుడు "పూరీలు, పూరీలు" అనుకుంటూ దారివెంట నడవసాగాడు. అలా చాలా దూరం నడిచాడు. అతను ఎందుకలా అంటున్నాడో అర్థంకాక వింతగా చూడసాగారు దారిలోని జనం.

కొంతదూరం వెళ్ళాక ఒక కాలువ అడ్డం వచ్చింది. అప్పటిదాకా అల్లుడు "పూరీలు పూరీలు" అనుకుంటూనే ఉన్నాడు. ఐతే కాలువ ఇవతలి గట్టు నుండి అవతలి గట్టుకు దూకుతూ "అద్దిరబన్నా !" అన్నాడు. ఇవతలికి రాగానే పూరీల పేరు మరిచిపోయి "అద్దిరబన్నా, అద్దిరబన్నా" అనుకుంటూ ఇంటికి వెళ్ళాడు.






ఇంటికి వెళ్ళగానే భార్యను పిలిచి "ఇవాళ మీ అమ్మ నాకు అద్దిరబన్నాలు చేసి పెట్టింది. చాలా బాగున్నాయవి. నువ్వు కూడా వెంటనే అవి తయారు చెయ్యి" అన్నాడు అందుకు అతని భార్య వింతగా "అద్దిరబన్నాలు ఏమిటీ ? అలాంటి వంటకం గురించి నేనెప్పుడూ వినలేదు. నేను చేయలేను" అంది. దాంతో అల్లునికి కోపం వచ్చింది. "మర్యాదగా అద్దిరబన్నాలు చెయ్యలేదంటే బాగుండదు మరి" అని బెదిరించాడు. దానికి భార్య "మీరేమైన చెప్పండి అద్దిరబన్నాలు నేను చేయలేను" అంది. అల్లునికి బాగాకోపం వచ్చింది. భార్యను ఆ చెంపా ఈ చెంపా ఎడా పెడా వాయించాడు. ఆమె లబోదిబోమని అరవడం మొదలుపెట్టింది. చుట్టుప్రక్కల ఆడవాళ్ళందరూ ఏం జరిగిందోనని పరుగెత్తుకుంటూ వచ్చారు. అల్లుడిని కొట్టవద్దని వారించారు. వారిలో ఒకావిడ "నీకేం పోయేకాలం వచ్చిందయ్యా. అమ్మాయిని గొడ్డును బాదినట్లు బాదావు. బుగ్గలు చూడు పూరీల్లా ఎలా పొంగి పోయాయో" అంది.


ఆ మాటలు వినగానే అల్లుడు ఆనందంగా "ఆఁ అవును అవే ! అవే ! పూరీలు, పూరీలు" అని అరవసాగాడు. కాసేపటికి అందరికీ విషయం అర్థమయ్యింది. అంతా కలిపి అల్లుని మతిమరుపుకు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకున్నారు. ★

# పేదవాడు-దేవత

**ఒ**క ఊళ్ళో ఒక పేదవాడు ఉండేవాడు. అడవికి వెళ్ళి కట్టెలు కొట్టి తెచ్చి అమ్మి బ్రతికేవాడు. నిజాయితీపరుడు కూడా.

ఎప్పటిలాగానే ఒకరోజు అడవికి వెళ్ళాడు. ఒక పెద్ద చెట్టు ఎక్కి కట్టెలు కొట్టసాగాడు. అనుకోకుండా అతని చేతుల్లోంచి గొడ్డలి జారి క్రింద ఉన్న చెరువులో పడిపోయింది. దాంతో "రేపటినుండి ఎలా ?" అని ఏడుస్తూ కూర్చున్నాడు.

అతని ఏడుపు విని దేవత ప్రత్యక్షమైంది. "ఎందుకు ఏడుస్తున్నావు ?" అని అడిగింది. పేదవాడు విషయం చెప్పాడు. అప్పుడు దేవత ఒక బంగారు గొడ్డలి చూపించి "ఇది నీదేనా?" అని అడిగింది. "కాదు" అన్నాడు. ఈసారి ఒక వెండి గొడ్డలిని చూపించి "పోనీ ఇదైనా నీదేనా ?" అని అడిగింది కాదన్నాడు మూడవసారి అతని ఇనుప గొడ్డలినే చూపించి "ఇది నీదేనా ?" అని ప్రశ్నించింది. "అవును నాదే" అన్నాడు పేదవాడు సంతోషంగా. అతని నిజాయితీకి దేవత చాలా ఆనందపడింది. అతని గొడ్డలితోపాటు మిగతా రెండు గొడ్డళ్ళను ఇచ్చి హాయిగా బ్రతకమంది.





దేవత ఇచ్చిన గొడ్డళ్ళతో పేదవాడు ధనవంతుడయ్యాడు. భార్యతో సుఖంగా జీవించసాగాడు. ఒకసారి భార్యతో కలిసి వేరే ఊరికి ప్రయాణమయ్యాడు. వారు ప్రయాణిస్తున్న ఎద్దులబండి ఒకచోట బోల్తాపడి అతని భార్య చెరువులో పడిపోయింది. "అయ్యో నా భార్య చెరువులో మునిగిపోయింది. రక్షించండి." అని ఏడుస్తూ అరవసాగాడు అతడు.


ఏడుపు విని దేవత మళ్ళీ ప్రత్యక్షమైంది. "ఏమైంది" అనడిగింది. "నా భార్య చెరువులో మునిగిపోయింది" అని చెప్పాడు. అప్పుడు దేవత రంభను చూపించి "ఈమేనా నీ భార్య ?" అని అడిగింది. దానికతడు "అవును ఈమే" అన్నాడు. దేవతకు కోపం వచ్చింది. "నువ్వెంతో నిజాయితీపరుడివి అనుకున్నాను. రంభను నీ భార్య అంటావా ! నిన్ను ఇప్పుడే శపిస్తాను" అంది. దానికతడు "శాంతించు తల్లీ ! రంభను నా భార్య కాదంటే మరొకావిడను చూపిస్తావు. ఆమెనూ కాదంటే నా భార్యను చూపిస్తావు. అప్పుడు ఔనంటే మునుపు మూడు గొడ్డళ్ళను ఇచ్చినట్లుగానే ముగ్గురిని భార్యలుగా ఇస్తావు. వీరందరినీ నేనెలా పోషించగలను చెప్పు. అందుకే మొదటిసారి చూపించిన రంభనే నా భార్య అన్నాను" అని చెప్పాడు. అతని తెలివికి దేవత సంతోషించి అతని భార్యను ఇచ్చి పంపింది. ★

# పొట్టివాడు-ధనవంతుడు

**ఒ**క ఊళ్ళో ఒక పొట్టివాడు ఉండేవాడు. అందరూ అతన్ని చూసి నవ్వేవారు. ఐనా ఎవరినీ ఏమీ అనేవాడు కాదు. తనపని తాను చేసుకునేవాడు. అతనికి ఒక ఆవు ఉండేది. ఆ ఆవును మేపుకుంటూ, పాలు అమ్ముకుంటూ బ్రతికేవాడు.

ఒకరోజు మేతకు వెళ్ళిన ఆవు తప్పిపోయింది. చాలా చోట్ల వెదికాడు. ఆఖరికి ఒక ధనవంతుని ఇంటిముందు అతని ఆవు చర్మం కనిపించింది. తన ఆవును ధనవంతుడు చంపివేశాడన్న విషయం పొట్టివానికి అర్థం అయ్యింది. లబోదిబోమన్నాడు. తన ఆవును ఎందుకు చంపావని అడిగాడు. అందుకు ధనవంతుడు "పోరా పొట్టోడా ! నేను నీకు జవాబు చెప్పాలా !" అంటూ ఎడాపెడా వాయించాడు. పొట్టివాడు చేసేది లేక "కనీసం నా ఆవు చర్మమన్నా ఇవ్వు" దాన్ని అమ్ముకుని బ్రతుకుతాను" అని అడిగాడు. ధనవంతుడు సరేనని చర్మం ఇచ్చాడు. పొట్టివాడు దాన్ని తీసుకుని సంతకు బయలుదేరాడు

దారిలో చీకటి పడింది. అడవిలో పొట్టివాడు ఒక పెద్ద చెట్టు ఎక్కి కూర్చున్నాడు. కొద్దిసేపటికి కొంతమంది దొంగలు తాము దోచుకున్న బంగారంతో ఆ చెట్టు క్రిందికి వచ్చారు. వాటాలు వేసుకోసాగారు. పొట్టివాడు చెట్టుపైనుండి ఇదంతా చూస్తున్నాడు. అంతలో ఆవు






చర్మం అతని చేతుల్లోంచి జారి దొంగలమీద పడింది. దొంగలు తలెత్తి చూశారు. కొమ్మల మధ్య దాక్కున్న పొట్టివాడు వాళ్ళకు కనిపించలేదు. ఏదో భూతం చెట్టుపైన కూర్చుని ఆవును తిని చర్మాన్ని క్రింద పడేసిందని అనుకుని భయంతో బంగారాన్ని అక్కడే వదిలి పరుగెత్తారు. పొట్టివాడు ఆ బంగారాన్ని తీసుకుని ఇంటికి వెళ్ళాడు. సంతోషంగా జీవించసాగాడు.

ధనవంతునికి ఈ విషయం తెలిసింది. అతడు తన దగ్గరున్న ఆవులన్నింటిని చంపి వాటి చర్మాలను చుట్ట చుట్టుకొని అడవిలోకి బయలుదేరాడు. ఇదివరకు పొట్టివాడు ఎక్కిన చెట్టే ఎక్కి కూర్చున్నాడు. కాసేపటికి దొంగలు వచ్చి తాము దొంగిలించిన బంగారాన్ని వాటాలు వేసుకోసాగారు. ధనవంతుడు వాళ్ళమీదకు ఆవుల చర్మాన్ని విసిరివేశాడు. దొంగలు తలెత్తి చూశారు. ధనవంతుడు కనిపించాడు. ఇదివరకు కూడా మోసం చేసింది వీడేనని భావించి ధనవంతుణ్ణి కిందికి దించి చితకబాదారు. ధనవంతుడు ఎలాగోలా వారి బారి నుండి బయటపడ్డాడు. పొట్టివాని మీద పగతీర్చుకోవాలనుకున్నాడు.

మరునాడు పొట్టివాని ఇల్లు తగటబెట్టాడు. పొట్టివాడు ఆ బూడిదను బండిలో నింపుకుని సంతకు బయలుదేరాడు. దారిలో అతనికి రాజు ఎదురయ్యాడు. "నీ బండిలో ఏమున్నాయి" అని అడిగాడు రాజు. "బంగారం ఉంది" అని చెప్పాడు పొట్టివాడు. "నా బండిలో వజ్రాలు ఉన్నాయి. కనుక మనమిద్దరం బండ్లు మార్చుకుందాం" అన్నాడు రాజు. ఇద్దరూ బండ్లు మార్చుకున్నారు. ఇంటికి వెళ్ళిన పొట్టివాడు ఆ వజ్రాలతో మరింత ధనవంతుడు అయ్యాడు.

రాజు ద్వారా పొట్టివానికి వజ్రాలు లభించిన విషయం తెలుసుకున్న ధనవంతుడు తన ఇండ్లన్నీ తగులబెట్టుకుని బూడిదను బండ్లలో నింపుకుని బయలుదేరాడు. దారిలో రాజు కలిశాడు. "ఇదివరకు నా దగ్గర వజ్రాలు తీసుకుని బూడిదను ఇచ్చింది వీడే కాబోలు" అంటూ ధనవంతుడిని బాగా కొట్టాడు. ధనవంతుడు మరింత కోపంతో పొట్టివాని ఇంటికి వెళ్ళాడు.

పొట్టివాణ్ణి ఒక బస్తాలో మూటగట్టి ఎత్తుకెళ్ళి చెరువులో పడేశాడు. పొట్టివాడు ఎలాగోలా బస్తాలోంచి బయటపడి ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నాడు. అప్పుడు ధనవంతుడు "నువ్వెలా బయటపడ్డావు" అని అడిగాడు. అందుకు పొట్టివాడు. "నీళ్ళలో పడిన నన్ను దేవుడు రక్షించి చాలా బంగారాన్ని కానుకగా ఇచ్చాడు" అని చెప్పాడు. తనను కూడా మూటగట్టి చెరువులో పడేమయని పొట్టివాడ్ని బ్రతిమిలాడాడు ధనవంతుడు. పొట్టివాడు అలాగే చేశాడు. అంతే ! ధనవంతుడు ఇక తిరిగి రాలేదు. పొట్టివాడు ఆనందంగా జీవించాడు. ★



# పగటికలలు



ఒక ఊళ్ళో ఒక అమ్మాయి ఉండేది. ఆమె తనకున్న ఆవుల పాలు పితికి వాటిని సంతలో అమ్ముతూ జీవించేది. ఆమెకు విలాసంగా జీవించాలని, ఖరీదైన బట్టలు ధరించాలని కోరికగా ఉండేది. వాటి గురించి ఊహించుకుంటూ ఎప్పుడూ పగటికలలు కనేది.

ఒకరోజు పొద్దున్నే ఆ అమ్మాయి పాకకు వెళ్ళింది ఒక కుండ నిండా ఆవుపాలు పితికింది. ఆ కుండను తలమీద పెట్టుకుని సంతకు బయలుదేరింది. దారి పొడవునా తన అందమైన జీవితం గురించి కలలు కనసాగింది.

తాను ఈ పాలను సంతలో అమ్మితే కొంత డబ్బు వచ్చింది. ఆ డబ్బుతో ఒక కోడిపెట్టను కొన్నది. ఆ కోడిపెట్ట చాలా గుడ్లు పెట్టి వాటిని పొదిగి పిల్లల్ని చేసింది. ఆ కోడిపిల్లలు పెరిగి పెద్దవై గుడ్లు పెట్టి పిల్లల్ని చేశాయి. ఆ పిల్లలు మళ్ళీ పిల్లల్ని చేశాయి. వాటి ద్వారా తనకు బోలెడంత ఆదాయం వచ్చింది. ఆ డబ్బుతో మంచి ఇల్లు కట్టింది. ఖరీదైన దుస్తులు కొని ధరించింది. ఒక అందమైన యువకుడితో ఆమె పెళ్ళి జరిగింది. ఆ యువకుడు ఆమె కలిసి నాట్యం చేయసాగారు.

ఇలా ఆమె పగటికల కంటూ దారివెంట నాట్యం చేస్తూ ముందుకు నడవసాగింది. ప్రజలు ఆ దృశ్యాన్ని వింతగా చూడసాగారు. చేతులు ఊపుతూ, శరీరాన్ని కదిలిస్తూ ఆమె వేగంగా నాట్యం చేస్తుండడంతో ఆమె తలమీద ఉన్న పాలకుండ అదుపు తప్పి క్రింద పడి పగిలిపోయింది. పాలన్నీ నేల పాలయ్యాయి.

అప్పుడు ఆమె కళ్ళు తెరిచింది. తాను చేసిన పనికి సిగ్గుపడింది. తాను ఊహించినవన్నీ జరుగకపోగా బంగారం లాంటి పాలు కూడా మట్టిలో కలిసినందుకు బాధ పడింది. పగటికలలు పనికిచేటు అని తెలుసుకుంది. ★

# దొరికిన దొంగ

ఒక ఊరిలో ఒకతను ఉండేవాడు. అతడు చాలా తిండిపోతు. ఎప్పుడూ తిండి మీదే ధ్యాస పెట్టేవాడు. అతనికి పెళ్ళి అయింది. ఒకసారి దసరా పండుగకు అతని అత్తగారు వాళ్ళ ఇంటికి పిలిచారు ముందుగా భార్యను పంపించాడు. రేపు పండుగ అనగా తాను కూడా బయలుదేరాడు.


అతడు అత్తగారి ఇంటికి వెళ్ళేసరికి తలుపు వేసి ఉంది. వెనుక నుండి వెళ్దామని వెళ్ళాడు. అక్కడ వంటగది ఉంది. తన భార్య అత్త కలిసి గారెలు చేయడం కోసమని పిండిని తయారు చేస్తున్నారు. అప్పుడతడు తన మనసులో "నేనెప్పుడు వచ్చినా మా అత్త నాకు పది గారెలు మాత్రమే పెడుతుంది. తర్వాత అడిగితే అయిపోయాయి అంటుంది. అసలు ఆమె ఎన్ని గారెలు చేస్తుందో తెలుసుకోవాలి" అనుకుని తలుపు చాటున నక్కాడు.


లోపల వాళ్ళు నూనెలో గారె వేసినపుడు శబ్దం రాగానే "ఒకటి... రెండు... మూడు" అంటూ లెక్కపెట్టసాగాడు. అలా అతడు మొత్తం వంద గారెలు చేసినట్లుగా లెక్కపెట్టుకున్నాడు. తరువాత ముందు నుండి వెళ్ళి తలుపు తట్టాడు. అత్త, భార్య అతన్ని బాగా ఆదరించారు. మర్యాద చేశారు. ఆ రాత్రి మంచి భోజనం పెట్టారు.



మరునాడు పండుగ. మధ్యాహ్నం కాగానే అందరూ భోజనానికి కూర్చున్నారు. ఎప్పటిలాగే అత్త అతనికి పది గారెలు పెట్టింది. అవి చాలా రుచిగా ఉండడంతో కొద్దిసేపట్లోనే తినేశాడు. అప్పుడు అత్త "అల్లుడు గారూ ఇంకో రెండు గారెలు పెట్టమంటారా ?" అని అడిగింది. అందుకు అల్లుడు. "రెండేమిటి ఇరవై పెట్టినా తింటాను. మీ ఇంట్లో ఇంకా తొంభై గారెలు ఉన్నాయి కదా !" అన్నాడు.

అల్లుని మాటలు విన్న అత్త చాలా ఆశ్చర్యపోయింది. తాము వంద గారెలు చేసిన విషయం అల్లునికి ఎలా తెలిసిందో ఆమెకు అర్థం కాలేదు. తన అల్లునికి మంత్రశక్తి ఉందని అనుకుంది. అందుకే తాము వంద గారెలు చేసిన విషయం తెలుసుకున్నాడనుకుంది. సంతోషపడింది. తన అల్లుని దగ్గర మహిమలు ఉన్నాయని ఊరంతా ప్రచారం చేసింది. ఆమె చేసిన పనికి అల్లుడు భయపడ్డాడు. ఎంతోమంది వచ్చి అల్లునికి తమ బాధలు చెప్పుకొని వాటిని పోగొట్టమని అడగసాగారు. వాళ్ళకు తన మాటకారితనంతో ఏదో ఒకటి చెప్పి పంపించసాగాడు.





ఈ విషయం రాజుగారికి తెలిసింది. రాజుగారి ఇంట్లో ఉన్న బంగారాన్ని ఎవరో దొంగ ఎత్తుకుపోయాడు రాజు అల్లుడిని పిలిచి "ఆ దొంగ ఎవరో వారం రోజుల లోపల చెప్పాలి. లేదంటే నీ తల ఎగిరిపోతుంది" అని చెప్పాడు. అల్లునికి అప్పుడే ప్రాణాలు పోయినంత పనైంది. ఏం చేయాలో అర్థం కాలేదు ఐతే ఆ బంగారాన్ని దొంగిలించిన దొంగ అల్లుడ్ని అనుసరించసాగాడు. రాజుకు తనపేరు చెబుతాడేమోనని దొంగ భయపడసాగాడు. ఆ దొంగ పేరు "దొరకదు".

ఒకరోజు రాత్రి పడకగదిలో అల్లుడు భార్యతో మాట్లాడుతున్నాడు. దొంగ వాళ్ళ మంచం క్రింద దూరి వాళ్ళ మాటలు వింటున్నాడు. "ఆ దొంగ ఎవరో మీరు కనిపెట్టారా ?" అని అడిగింది భార్య. అందుకు అల్లుడు విసుగ్గా "వాడా ? వాడు దొరకదు" అన్నాడు. తానిక దొంగను కనుక్కోలేననే ఉద్దేశంతో.

ఆ మాటలు విన్న దొంగ వణికిపోయాడు. అల్లునికి తన పేరు తెలిసిపోయిందని అనుకుని బయటకి వచ్చి అల్లుని కాళ్ళమీద పడ్డాడు. క్షమించమని వేడుకున్నాడు. రాజుకు తన పేరు చెప్పవద్దని చెప్పి తాను దొంగిలించిన బంగారాన్ని అల్లుడికి ఇచ్చి వెళ్ళిపోయాడు. అల్లుడు ఆ బంగారాన్ని రాజుకు ఇచ్చాడు. రాజు ఎన్నో కానుకలతో అల్లుడిని గౌరవించాడు. ★

# మూర్ఖుడైన రాజు

**ఒ**క రాజు ఉండేవాడు. అతడు చాలా మూర్ఖుడు. ప్రజలను సరిగా చూసుకునేవాడు కాదు. వారిని ఎన్నో బాధలకు గురి చేసేవాడు

ఒకరోజు రాజు వద్దకు ఇద్దరు మనుషులు వచ్చారు. వాళ్ళు సాలెవాళ్ళు. వాళ్ళు రాజుతో "మేము చాలా మంచి బట్టలు నేస్తాము. మాలాగా ఎవ్వరూ నేయలేరు. మీ గొప్పతనం విని మీకు బట్టలు నేసి ఇవ్వాలని వచ్చాము" అని చెప్పారు.

దానికి రాజు "మీరు ఎలాంటి బట్టలు నేస్తారో చెప్పండి" అన్నాడు. అందుకు సాలెవాళ్ళు "మేము పట్టు వస్త్రాలు నేస్తాము. అవి తెలివైన వారికే కనబడతాయి. తెలివితక్కువవారికి కనబడవు" అని చెప్పారు.

రాజుకు వాళ్ళచేత బట్టలు నేయించుకోవాలనిపించింది. వాళ్ళకు తన కోటలో ఒక గది ఇచ్చాడు. అందులో వాళ్ళు మగ్గం ఏర్పాటు చేసుకున్నారు. ఐతే నిజానికి వాళ్ళు అలాంటి బట్టలు నేయరు. మూర్ఖుడైన రాజుకు ఆ విధంగా చెప్పి నమ్మించారు. కొద్దిరోజుల తరువాత రాజు సాలెవాళ్ళు బట్టలు నేయడం ఎంతవరకు వచ్చిందో చూసి రమ్మని తన మంత్రిని పంపించాడు.





మంత్రి సాలెవాళ్ళ గదికి వెళ్ళి చూశాడు. అక్కడ మగ్గం మీద ఎలాంటి దారాలు కనిపించలేదు. సాలెవాళ్ళు మగ్గంలో కూర్చుని నేస్తున్నట్లుగా నటించసాగారు.

తనకు మగ్గం మీద బట్టలు కనిపించలేదని చెబితే రాజు తనను తెలివితక్కువవానిగా జమ కడతాడని భావించిన మంత్రి రాజుతో సాలెవాళ్ళు బట్టలు నేస్తున్నారని అవి చాలా అందంగా ఉన్నాయని చెప్పాడు. తర్వాత రాజు వెళ్ళి చూశాడు. తనకు బట్టలు కనిపించలేదని చెబితే బాగుండదని తాను కూడా బట్టలు బాగున్నాయని అందరితో చెప్పాడు.

ఇంతలో రాజుగారి పుట్టినరోజు వచ్చింది. సాలెవాళ్ళు వస్త్రాలు నేయడం పూర్తయిందని చెప్పి ఒక ఖాళీ పళ్ళెంను పట్టుకుని రాజు వద్దకు వచ్చారు. అందులో రాజుకేగాక ఎవరికీ ఏమీ కనిపించలేదు. అయినా ఎవరూ మాట్లాడలేకపోయారు. సాలెవాళ్ళు రాజు బట్టలు విప్పారు. స్నానం చేయించారు. కొత్త బట్టలు కట్టినట్లుగా నటించారు.

రాజును ఏనుగు మీద కూర్చోబెట్టి ఊరేగింపుకు బయలుదేరారు. ప్రజలందరికీ రాజు బట్టలు లేకుండా కనిపించాడు. ఎవ్వరూ మాట్లాడే సాహసం చేయలేదు. అప్పుడొక చిన్న పిల్లవాడు తన తల్లితో “ఎందుకమ్మా రాజు గారిని బట్టలు లేకుండా ఊరేగిస్తున్నారు ?” అని అడిగాడు.

దాంతో విషయం అందరికీ అర్థమైపోయింది. అందరూ గొల్లున నవ్వారు. రాజు తాను మోసపోయిన విషయం గ్రహించాడు. చాలా అవమానానికి గురయ్యాడు. అప్పటికే సాలెవాళ్ళు ఉడాయించారు. ★

# భార్యాభర్తల పందెం

**ఒ**క ఊళ్ళో ఇద్దరు భార్యాభర్తలు ఉండేవారు భర్త రోజూ ఊరంతా తిరిగి బిచ్చం ఎత్తుకు వచ్చేవాడు. భార్య అతనికి వండిపెట్టేది.

ఒకరోజు భర్త అడుక్కునేందుకు వెళ్తే ఒక ఇంటివారు కొన్ని బియ్యం దానం చేశారు. అప్పుడు భార్యభర్తతో "ఈ బియ్యంతో రొట్టెలు చేసుకుని తిందాం రొట్టెలు తినాలని నాకు ఎప్పటినుంచో కోరికగా ఉంది" అంది. అందుకు భర్త కూడా సరేనన్నాడు. భార్య ఆ బియ్యాన్ని విసిరింది. పిండితో మూడు రొట్టెలు తయారుచేసింది.

ఇద్దరూ సంతోషంగా చెరొక రొట్టెను తిన్నారు. మూడవ రొట్టెను తినడంలో ఇద్దరికీ తగాదా ఏర్పడింది. "నేను చాలా కష్టపడి బిచ్చం ఎత్తుకుంటేనే బియ్యం వచ్చాయి. అందువల్ల ఆ రొట్టె నాకే చెందాలి" అన్నాడు భర్త. "కాదు. నేను చాలా కష్టపడి రొట్టెలు చేశాను. ఆ రొట్టె నాదే" అంది భార్య. ఇలా ఇద్దరూ చాలాసేపు తగవులాడుకుని చివరకు ఒక ఒప్పందానికి వచ్చారు. ఇద్దరూ కళ్లు మూసుకుని కదలకుండా పడుకోవాలి. ఎవరు ముందు కదిలితే వాళ్ళు ఓడిపోయినట్లు లెక్క గెలిచినవారు మూడవ రొట్టె తినాలి. ఈ ఒప్పందానికి ఇద్దరూ అంగీకరించి కదలకుండా పడుకున్నారు.





ఆ రోజు రాత్రి గడిచి తెల్లవారింది. బారెడు పొద్దెక్కినాక కూడా భార్యాభర్తలు నిద్ర లేవకపోవడం చూసిన చుట్టు ప్రక్కలవాళ్ళు వారి గుడిసె తలుపులు విరగ్గొట్టి లోపలికి వచ్చారు. భార్యాభర్తలు చనిపోయారని నిర్ణయించుకున్నారు. శవయాత్రకు ఏర్పాట్లు చేశారు. ఇద్దరిని శ్మశానానికి మోసుకుపోయారు. ఇంత జరుగుతున్నా భార్యాభర్తలు కదలలేదు. కదిలితే తాము ఓడిపోతామని, రొట్టెను కోల్పోతామని వారి భయం. భార్యాభర్తలిద్దరినీ చితిమీద పడుకోబెట్టారు. నిప్పంటించారు. మంట చురుక్కున తగలడంతో భార్య చటుకున్న లేచి "అమ్మో" అని అరిచింది. వెంటనే భర్త లేచి "నేనే గెలిచాను. నాకు రెండు, నీకు ఒకటి" అని గట్టిగా అరవసాగాడు.

చితి దగ్గర నిలబడ్డ ముగ్గురు మనుషులు చనిపోయిన భార్యాభర్తలిద్దరూ దెయ్యాలుగా మారారని, తమలో ఇద్దరిని భర్త, ఒకరిని భార్య చంపి తినాలని అనుకుంటున్నారని అనుకుని భయంతో అరుస్తూ పరుగు లంకించుకున్నారు. ★


# ఐదుగురు మిత్రులు

ఒక పేను ఎంతో కష్టపడి కంది చేను వేసింది. కందిపంట బాగా పడింది. ఇక కోత కోయవలసి ఉంది. ఒకరోజు ఒక దొంగ ఆ దారివెంట వెళుతూ కందిచేను చూశాడు. దానిమీద కన్ను కుట్టింది. "ఈ చేను ఎవరిది" అని అడిగాడు అక్కడ ఉన్న జనాన్ని. దానికి వాళ్ళు "ఇది పేను చేను" అని చెప్పారు. అందుకు దొంగ "ఓహో ! అలాగా ! ఐతే పేను నన్ను ఏం చేయగలుగుతుందిలే" అని కందిచేనంతా కోసి బండిలో వేసుకుని వెళ్ళిపోయాడు.

పేను వచ్చి జరిగిన విషయమంతా తెలుసుకుంది. తాను చాలా కష్టపడి పెంచిన చేనును దొంగ ఎత్తుకుపోయినందుకు చాలా బాధ పడింది. ఎలాగైనా ఆ దొంగను చంపి తన పగ చల్లార్చుకోవాలనుకుంది. వెంటనే దొంగ ఇంటికి బయలుదేరింది.

పేనుకు దారిలో ఒక గుండ్రాయి ఎదురైంది. "పేను బావా ! పేను బావా ! ఎక్కడికి వెళ్తున్నావు" అని అడిగింది గుండ్రాయి. "నేను కష్టపడి పండించిన కందిపంటను ఒక దొంగ ఎత్తుకుపోయాడు. వాడిని చంపడానికి బయలుదేరాను" అని చెప్పింది పేను. దానికి గుండ్రాయి "ఐతే నీకు సాయంగా నేను వస్తాను పదా !" అంటూ పేను వెంట నడిచింది.

అలా అవి కొంతదూరం వెళ్ళగానే ఒక తేలు ఎదురయ్యింది. "పేను బావా ! గుండ్రాయి బావా ! ఎక్కడికీ బయలుదేరారు" అని అడిగింది. పేను జరిగిన విషయమంతా వివరించింది. అది విన్న తేలు "నేను కూడా నీకు సాయంగా వస్తాను. పదండి" అంటూ బయలుదేరింది.





అవి మూడూ మరికొంత దూరం వెళ్ళేసరికి ఒక పాము ఎదురైంది. 'పేను బావా ! గుండ్రాయి బావా ! తేలు బావా ! ముగ్గురూ కలిసి ఎక్కడికో వెళ్తున్నట్లున్నారు" అని అడిగింది పాము. తాము ఎక్కడికి వెళుతున్న సంగతి పేను పాముకు చెప్పింది. అది విన్న పాము "మీతో పాటు నేను కూడా వస్తాను" అంటూ వాటివెంట రాసాగింది.

ఇంకొంత దూరం వెళ్ళాక ఒక పులి ఎదురైంది. "ఏమిటీ అందరూ కలిసి బయలుదేరారు. ఎక్కడికో !" అని అడిగింది. పేను జరిగిన విషయం చెప్పింది. "నీకు కీడు చేసిన దొంగను చంపడానికి నేనూ సాయంగా వస్తాను పదండి" అంటూ పులి కూడా వాళ్ళ వెంట నడవసాగాంది.

అన్నీ కలిసి సాయంత్రం వేళకు దొంగ ఇంటికి చేరుకున్నాయి. పులి ఇంటి ముందు తలుపు ప్రక్కన నిలబడింది. గుండ్రాయి దూలం మీద కూర్చుంది. తేలు అద్దం వెనక నక్కింది. పాము పొయ్యిలో పడుకుంది. పేను దొంగ గెడ్డంలోకి వెళ్ళి కరవసాగింది.

దొంగ అద్దంలో గెడ్డాన్ని చూసుకుందామని అద్దం పట్టుకున్నాడు. వెంటనే తేలు కరిచింది. దొంగ "మంట మంట" అని ఎగురుతూ పొయ్యిలో కాలు వేశాడు. అక్కడున్న పాము కాలుకు కాటు వేసింది. దొంగ మరింత భయంతో బయటికి రాబోగా దూలం మీది గుండ్రాయి బలంగా అతని తలమీద పడింది. దొంగ తల పగిలింది. పరుగెత్తుకుంటూ బయటకు రాగానే తలుపు దగ్గర ఉన్న పులి అతన్ని తినేసింది.

దొంగను చంపినందుకు అవన్నీ ఆనందించాయి. ★

# కోతి డప్పు

ఒక కోతి ఉండేది. ఒకరోజు దానికి ఐదు పైసలు దొరికాయి. ఆ ఐదు పైసలతో కోమటి దుకాణానికి వెళ్ళింది. బరాణీలు కొనుక్కుంది. ఒక చెట్టుమీద కూర్చుని తినసాగింది. అప్పుడు ఆ బరాణీ గింజల్లోంచి ఒక గింజ జారి కింద ఉన్న ముండ్ల కంపలో పడింది. కోతి దానికోసం కంపలోకి వెళ్ళింది. దానితోకకు ఒక ముల్లు విరిగింది.

అదే సమయంలో ఆ దారి వెంట ఒక మంగలివాడు వెళ్తుంటే అతన్ని పిలిచి ముల్లు తీయమని అడిగింది. మంగలి ముల్లు విరిగినంత వరకు దాని తోకను కోసివేశాడు.

అప్పుడు కోతి "నా తోకను కోసివేశావు కదూ ! మర్యాదగా నా తోక నాకు ఇచ్చెయ్ ! లేదా నీ కత్తి ఇవ్వు' అని గొడవ చేసింది. మంగలి చేసేది లేక కత్తిని ఇచ్చి వెళ్ళిపోయాడు. కత్తితో కోతి ముందుకు వెళ్ళసాగింది. ఒకావిడ చేతితో కట్టెలు విరుస్తూ కనిపించింది. కోతి ఆమెతో "చేతితో కట్టెలు విరిచే బదులు ఈ కత్తితో నరుకు బాగుంటుంది" అంది. ఆమె సరేనని కత్తితో కట్టెలు నరకసాగింది. కొన్ని కట్టెలు నరకగానే కత్తి విరిగిపోయింది. అప్పుడు కోతి "నా కత్తి నాకివ్వు లేదంటే కట్టెలివ్వు" అని గోల చేసింది. ఆమె కొన్ని కట్టెల్ని ఇచ్చింది.





కోతి ఆ కట్టెలతో బయలుదేరింది. కొద్ది దూరం వెళ్ళాక ఒకావిడ పొయ్యిలో కాళ్ళు పెట్టి నూనె తయారు చేస్తూ కనిపించింది. కోతి ఆమెతో "పొయ్యిలో కాళ్ళెందుకు పెట్టావు. ఇదిగో ఈ కట్టెలు పెట్టు" అంటూ కట్టెలను ఇచ్చింది. కట్టెలు పూర్తిగా కాలిపోగానే "నా కట్టెలైనా ఇవ్వు లేకపోతే నూనె అయినా ఇవ్వు" అని ఆమెతో గోల చేయసాగింది. అప్పుడు ఆమె నూనె ఇచ్చింది


మరికొంత దూరం వెళ్ళేసరికి కోతికి "మూకుడులో నీళ్ళు పోసి పూరీలు చేస్తున్న ఒకావిడ కనిపించింది అవిడతో "ఎవరైనా నూనెతో పూరీలు చేస్తారు గానీ నీళ్ళతో చేస్తారా ?" అంటూ నూనె ఇచ్చింది. నూనె ఐపోగానే "నా నూనైనా ఇవ్వు లేక పూరీలైనా ఇవ్వు" అని గొడవ చేసింది ఆమె పూరీ ఇచ్చింది కోతి ముందుకు వెళ్ళింది. ఒకచోట చిన్నపిల్ల ఏడుస్తూ కనిపించింది. ప్రక్కన వాళ్ళ అమ్మమ్మ ఉంది. కోతి ఆ పిల్లకు పూరీ ఇచ్చింది ఆమె ఏడుపు ఆపి పూరీ తిన్నది. తర్వాత కోతి అమ్మమ్మతో "నా పూరీ అయినా ఇవ్వు లేక ఈ పిల్లనైనా ఇవ్వు" అని అడిగింది. ఆమె పిల్లను ఇచ్చింది.

ఒకచోట ఒక రైతు పొలం దున్నాలనుకున్నాడు. అతని దగ్గర ఎడ్లు లేవు. కోతి అతనితో 'ఈ పిల్లను కట్టి దున్ను" అంది. రైతు అలాగే చేశాడు. పిల్ల చనిపోయింది. అప్పుడు కోతి "పిల్లనైనా ఇవ్వు లేక నీ దగ్గరున్న డప్పు అయినా ఇవ్వు" అని గోల చేసింది. రైతు డప్పు ఇచ్చాడు.

కోతి ఆ డప్పు తీసుకుని ఒకచెట్టు మీద కూర్చుని వాయించడం మొదలుపెట్టింది. "తోక పోయి కత్తి వచ్చే ఢాం! ఢాం! ఢాం! కత్తిపోయె కట్టెలు వచ్చే ఢాం! ఢాం! ఢాం! కట్టెలుపోయి నూనె వచ్చే ఢాం! ఢాం! ఢాం! నూనెపోయి పూరీ వచ్చే ఢాం! ఢాం ! ఢాం ! పూరీపోయి పిల్లా వచ్చే ఢాం! ఢాం! ఢాం, పిల్లా పోయి డప్పు వచ్చే ఢాం! ఢాం! ఢాం! అని పాడుకుంది. ★



# ఉల్లిగడ్డ ఏడుపు




**ట**మోటా, ఉల్లిగడ్డ, పచ్చిమిరపకాయ, ఉప్పు ఈ నాలుగు మంచి స్నేహితులు. కలిసి మెలిసి ఉండేవి.

అవన్నీ ఒకరోజు తోటకు వెళ్ళి ఆడుకున్నాయి. ఆ తోటలో ఉన్న కొలనులో వాటికి స్నానం చేయాలనిపించింది. వెంటనే అన్నీ కొలనులోకి దూకి ఈత కొట్టసాగాయి. కాసేపటికి ఉప్పు నీటిలో కరిగిపోయింది.

తమ మిత్రుడిని కోల్పోయినందుకు టమోటా, ఉల్లిగడ్డ, పచ్చిమిరపకాయ విపరీతంగా ఏడ్చాయి. బాధతో రోడ్డుమీద నడుచుకుంటూ వెళ్ళసాగాయి. అంతలో ఒక బండి టమోటా మీదుగా వెళ్ళింది. దాంతో టమోటా చితికిపోయింది. అది చూసి పచ్చిమిరపకాయ, ఉల్లిగడ్డ "అయ్యో ! ఇంకో మిత్రుడిని కూడా కోల్పోయాము కదా !" అని మళ్ళీ బిగ్గరగా ఏడ్చాయి.

ఇంకొంత దూరం వెళ్ళేసరికి వీటికొక తాగుబోతు ఎదురయ్యాడు. పీకలదాకా సారా తాగిన అతనికి మిరపకాయ తినాలనిపించింది. వెంటనే మిరపకాయను పట్టుకుని నమిలి మింగేశాడు. తన ముగ్గురు మిత్రులను కోల్పోయేసరికి ఉల్లిగడ్డకు దుఃఖం ముంచుకొచ్చింది. "ఓరి దేవుడా ! అందరూ పోతే నేను ఏడ్చాను. నేనుపోతే నాకెవరు ఏడుస్తారు ?" అంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది.

అందుకే ఉల్లిగడ్డలు కోసేటపుడు దానికోసం మనం ఏడుస్తాము. ★

# ముసలమ్మ దురాశ


ఒక ఊరిలో చిన్న ముసలమ్మ, పెద్ద ముసలమ్మ ఉండేవారు. చిన్న ముసలమ్మ చెడ్డది. పెద్ద ముసలమ్మ మంచిది. ఇద్దరికి చెరొక మేక ఉంది.

ఒకరోజు పెద్ద ముసలమ్మ ఇంట్లో బియ్యం అయిపోయాయి. మేక ఆకలితో మే అని అరిచింది. అప్పుడు ముసలమ్మకు కోపం వచ్చింది. "నాకే తిండి లేక బాధపడుతున్నాను. నీకెక్కడ తెచ్చి పెట్టేది" అంటూ మేకను కొట్టి బయటకు వెళ్ళగొట్టింది.

మేక ఊరి బయటకు వెళ్ళింది అక్కడ కొండమీద నిలబడి ఆకాశం వైపు నోరు తెరిచి చూసింది. తర్వాత ఇంటికి వచ్చి మే అని అరిచింది. అంతే ముసలమ్మ ఇంటినిండా బంగారం, ముత్యాలు, వజ్రాలు నిండిపోయాయి. పెద్ద ముసలమ్మ వాటిని కొలవడానికి గాను శేరు అవసరం వచ్చి చిన్న ముసలమ్మను అడిగింది.

ఆమె ఏం కొలుస్తుందో తెలుసుకోవాలని శేరు లోపల చింతపండు అంటించి ఇచ్చింది చిన్న ముసలమ్మ. పెద్ద ముసలమ్మ ఆ శేరుతో బంగారం, ముత్యాలు కొలిచి తిరిగి చిన్న ముసలమ్మకు ఇచ్చివేసింది. ఒక చిన్న ముత్యం చింతపండుకు అంటుకుని ఉండడం గమనించింది చిన్న ముసలమ్మ.

పెద్ద ముసలమ్మ వద్దకు వెళ్లి "ఈ ముత్యం ఎలా వచ్చింది" అని అడిగింది. అప్పుడామె జరిగిన విషయమంతా చెప్పింది. చిన్న ముసలమ్మ ఇంటికి వెళ్ళింది. తన మేకను బాగా కొట్టింది. బయటకు వెళ్ళగొట్టింది. ఆ మేక ఊరి చివరికి వెళ్ళి గుట్టు ఎక్కింది. నోరు తెరిచి ఆకాశంవైపు చూసింది తిరిగి ఇంటికి వచ్చింది. మే అని అరిచింది. అప్పుడు చిన్న ముసలమ్మ ఇల్లంతా పేడతో నిండిపోయింది. ★



# ఏడుగురు అక్కాచెల్లెళ్ళ కథ



ఒక రాజు రాణి ఉండేవారు. వాళ్ళకు సంతానం కలుగలేదు. రాణి తనకు పిల్లలు కలగడం లేదన్న బాధతో ఎప్పుడూ దుఃఖిస్తూ ఉండేది. ఒకరోజు కలలో ఆమెకు దేవుడు కనిపించాడు. “ఊరి చివర పుట్టమీద మామిడిచెట్టు ఉంటుంది. ఆ చెట్టుకున్న మామిడిపండ్లలో ఒక పండు తిను. నీకు పిల్లలు కలుగుతారు.” అని చెప్పాడు దేవుడు.

మరునాడు రాణి రాజుతో కలిసి పుట్ట దగ్గరకు వెళ్ళింది. పుట్ట ఎక్కి ఏడు మామిడిపండ్లను తిన్నది అప్పుడే పుట్టలోంచి ఒక పాము బయటికి వచ్చి “ఒక పండు తినమని దేవుడు చెబితే ఏడు పండ్లు తిన్నావు. నీకు పుట్టే పిల్లలకు ఏడేళ్ళ వయసు రాగానే నిన్ను చంపేస్తాను” అంది. పాము మాటల్ని రాణి పట్టించుకోలేదు. కొంతకాలానికి రాణికి ఏడుగురు ఆడపిల్లలు పుట్టారు. వారిని ప్రేమగా పెంచి పెద్ద చేయసాగింది. వాళ్ళకు ఏడేళ్ళ వయసు వచ్చింది. అప్పుడు రాణికి పాము మాటలు గుర్తుకు వచ్చాయి. భయపడింది. పాము రాకుండా రోజూ రాత్రిపూట తన మంచం చుట్టూ మంటలు మండించి పడుకునేది. కానీ పాము పైనుండి వచ్చి రాణిని కరిచి చంపేసింది.

ఆ తర్వాత రాజు మరో పెళ్ళి చేసుకున్నాడు. సవతి తల్లి పిల్లల్ని బాగా చూసుకునేది కాదు. వాళ్ళని తిట్టేది, కొట్టేది. వారందరినీ బడికి పంపకుండా గంపలక్రింద కప్పి ఉంచేది. రాజు అడిగితే బడికే పంపానని చెప్పేది. కొంతకాలానికి ఆమెకు ఒక కొడుకు పుట్టాడు. దాంతో ఆమె పిల్లల్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఒకరోజు రాజుతో “నీ మొదటి భార్య పిల్లలందరినీ


అడవికి తీసుకువెళ్ళి చంపిరా. లేకుంటే నేను నీతో కాపురం చేయను" అంది. రాజు ఎంత చెప్పినా వినలేదు. చివరకు రాజు విధిలేక తన ఏడుగురు కూతుళ్ళను తీసుకుని అడవికి వెళ్ళాడు. ఆడుకోమని చెప్పాడు. చీకటిపడ్డాక అందరూ వరుసగా పడుకున్నారు. రాజుకు తన కూతుళ్ళను చంపడానికి మనసొప్పలేదు. పిల్లలంతా మంచి నిద్రలో ఉండగా తానులేచి తన స్థానంలో ఒక పెద్ద బండరాయిని పెట్టి వెళ్ళిపోయాడు.

తెల్లవారాక కూతుళ్ళు లేచి తమ తండ్రి బండరాయిగా మారాడనుకుని దుఃఖించారు. ఆ తర్వాత అదే అడవిలో ఆహారం సంపాదించుకుంటూ, ఉయ్యాలలూగుతూ సంతోషంగా జీవించసాగారు. ఇదిలా ఉండగా ఒకరోజు ఏడుగురు అన్నదమ్ములు ఆ అడవికి వేటకు వచ్చారు. వాళ్ళు ఆ అమ్మాయిలతో "మీరెవరు ? ఈ అడవిలో ఎందుకు ఉంటున్నారు ?" అని అడిగారు. అప్పుడు వాళ్ళు ఏడుస్తూ తమ గతం గురించి చెప్పారు. అది విన్న అన్నదమ్ములు "మీరెవరో కాదు. మా కోడళ్ళే. మీ అమ్మ మా అక్క. మాతో రండి మా ఇంటికి వెళదాం" అంటూ ఆ అమ్మాయిలందరినీ తమతో తీసుకుపోయారు. ఆ అమ్మాయిలు వెళ్ళాక అన్నదమ్ముల ఇంట్లో సిరిసంపదలు పెరిగాయి. వాళ్ళు చాలా ధనవంతులయ్యారు. ఏడుగురు అన్నదమ్ములు ఆ ఏడుగురు అమ్మాయిలను పెళ్ళి చేసుకోవాలనుకున్నారు. లగ్నం పెట్టించారు.

ఇదిలా ఉండగా తన కూతుళ్ళు ఇంటినుండి వెళ్ళిపోయాక రాజుకు దరిద్రం పట్టుకుంది. రాజ్యం పోయింది. బికారిగా మారాడు. తన భార్యతో ఊరూరూ తిరుగుతూ బిచ్చమెత్తుకోసాగాడు. ఒకరోజు తన కూతుళ్ళు ఉన్న ఊరికి వచ్చారు. ఆ రోజే వాళ్ళ పెళ్ళి జరుగుతుంది. తమ పెళ్ళికి వచ్చి బిచ్చమెత్తుకుంటున్న తండ్రిని గుర్తుపట్టారు కూతుళ్ళు. ఏడుస్తూ తండ్రిని కౌగలించుకున్నారు. తన కూతుళ్ళు బ్రతికే ఉన్నందుకు చాలా సంతోషించాడు. తర్వాత అందరూ కలసి హాయిగా జీవించారు. ★



# పెద్దరాణి-చిన్నరాణి



ఒక రాజుకు ఇద్దరు భార్యలు ఉండేవారు. పెద్దరాణికి తలమీద ఒక వెంట్రుక, చిన్నరాణికి రెండు వెంట్రుకలు ఉండేవి. పెద్దరాణి మంచిది. చిన్నరాణి చెడు గుణం కలది. కానీ రాజు "నీ తలమీద ఒక్కవెంట్రుకే ఉంది. నువ్వు అందంగా లేవు. కనుక బయటకు వెళ్ళిపో" అంటూ పెద్దరాణిని కోట నుండి వెళ్ళగొట్టాడు.

అడవిలో ఒక ముసలమ్మ ఉందని ఆమె చెప్పినట్లు చేస్తే తలనిండా వెంట్రుకలు వస్తాయని పెద్దరాణికి ఎవరో చెప్పారు. పెద్దరాణి ఆమె వద్దకు బయలుదేరింది. దారిలో ఆమెకు మల్లెచెట్టు ఎదురు వచ్చింది. "నాకు నీళ్ళు పోస్తేనే దారి ఇస్తాను" అంది. పెద్దరాణి అలాగే చేసింది. చెట్టు దారి ఇచ్చింది. పోగా పోగా ఒక చీమ ఎదురుపడింది. "నాకు పంచదార పెడితేనే నీకు దారి ఇస్తాను" అంది. పెద్దరాణి చీమకు పంచదార పెట్టింది. చీమ దారి ఇచ్చింది.

పెద్దరాణి ఇంకొంచెం ముందుకు వెళ్ళాక ఒక ఎద్దు ఎదురైంది. "నాకు గడ్డి వేస్తేనే దారి ఇస్తాను" అంది. రాణి గడ్డి వేసింది. ఎద్దు దారి ఇచ్చింది. మరికొంత దూరం వెళ్ళగానే దేవుడు అడ్డు వచ్చాడు. "నాకు కొబ్బరికాయ కొడితేనే దారి ఇస్తాను" అన్నాడు. పెద్దరాణి అలాగే చేసింది. దేవుడు దారి ఇచ్చాడు. రాణి ముందుకు సాగింది.


చివరకు పెద్దరాణి ముసలమ్మ ఇంటికి చేరింది. అక్కడ ఒక చెరువు ఉంది. ముసలమ్మ పెద్దరాణితో "చెరువులో మూడుసార్లు మునుగు తలనిండా వెంట్రుకలు వస్తాయి" అంది. రాణి అలాగే మునిగింది. ఆమెకు తలనిండా అందంగా వెంట్రుకలు వచ్చాయి. చాలాసంతోషంగా ఇంటికి బయలుదేరింది.

దారిలో దేవుడు ఎదురయ్యాడు. "నీకు కొత్తచీర కావాలా ? పాత చీర కావాలా ?" అని అడిగాడు. "పాతచీర కావాలి" అంది రాణి. దేవుడు ఆమెకు కొత్తచీర ఇచ్చాడు. రాణి ఇంకా ముందుకు రాగా ఎద్దు కలిసింది. "నీకు బంగారు నగలు కావాలా ? వెండి నగలు కావాలా?" అని అడిగింది. "వెండి నగలు కావాలి" అని చెప్పింది రాణి. ఎద్దు ఆమెకు చాలా బంగారు నగలను ఇచ్చింది. రాణి ముందుకు సాగింది. ఇంకొంత దూరం వెళ్ళేసరికి చీమ ఎదురైంది. "నీకు పాయసం కావాలా ? అన్నం కావాలా ?" అని అడిగింది. పెద్దరాణి "అన్నం కావాలి" అంది. చీమ పాయసం ఇచ్చింది. రాణి కడుపునిండా పాయసం త్రాగి బయలుదేరింది.

మరికొంత దూరం వెళ్ళేసరికి మల్లెచెట్టు ఎదురొచ్చింది. "నీకు మల్లెపువ్వులు కావాలా? ఆకులు కావాలా ?" అని అడిగింది. "ఆకులే కావాలి" అంది పెద్దరాణి. మల్లెచెట్టు ఆమె తలనిండా మల్లెపూలు పెట్టింది.

రాణి సంతోషంతో రాజు దగ్గరకు వెళ్ళింది. కొత్తచీర, నగలు, తలనిండా వెంట్రుకలతో చాలా అందంగా ఉన్న పెద్దరాణిని చూసి రాజు ఆనందపడి ఆమెను లోనికి రానిచ్చాడు. చిన్నరాణిని వెళ్ళగొట్టాడు. పెద్దరాణి ద్వారా జరిగిన విషయాలు తెలుసుకున్న చిన్నరాణి ముసలమ్మ వద్దకు బయలుదేరింది.

దారిలో ఆమెకు మల్లెచెట్టు ఎదురైంది. "నాకు నీళ్ళు పోస్తేనే దారి ఇస్తాను" అంది. అందుకు చిన్నరాణి "నేను రాజుగారి భార్యను. నీకు నీళ్ళు పోయను పో" అంటూ ప్రక్కనుండి





వెళ్ళింది. ఇంకొంత దూరం వెళ్ళగానే చీమ ఎదురై "నాకు పంచదార పెడితేనే దారి ఇస్తాను" అంది. "నేను రాజు భార్యను నీకు పంచదార పెట్టను పో" అంటూ చిన్నరాణి ముందుకు నడిచింది. మరి కొంతదూరం వెళ్ళాక ఎద్దు ఎదురైంది. "నాకు గడ్డివేస్తేనే నీకు దారి ఇస్తాను" అంది అందుకు చిన్నరాణి "నేను రాజు భార్యను. నీకు గడ్డి వేయను పో" అంది. చివరికి దేవుడు ఎదురయ్యాడు. "నాకు కొబ్బరికాయ కొడితేనే దారి ఇస్తాను" అన్నాడు. "నేను రాజు భార్యను. నీకు కొబ్బరికాయ కొట్టను" అంటూ ముందుకు వెళ్ళింది.

ఆఖరికి చిన్నరాణి ముసలమ్మ ఇంటికి చేరుకుంది. "చెరువులో మూడుసార్లు మునుగు తలనిండా అందంగా వెంట్రుకలు వస్తాయి" అంది ముసలమ్మ. చిన్నరాణి అలా కాకుండా నాలుగుసార్లు మునిగింది. దాంతో ఆమెకు కొత్త వెంట్రుకలు రాకపోగా ఉన్న రెండు వెంట్రుకలు కూడా ఊడిపోయి బోడిగుండు అయ్యింది.

ఏడుస్తూ ఇంటికి బయలుదేరింది. దారిలో దేవుడు కలిసి "కొత్తచీర కావాలా ? పాతచీర కావాలా ?" అన్నాడు. "కొత్తచీర కావాలి" అంది. దేవుడు పాతచీర ఇచ్చాడు. ఎద్దు ఎదురై "బంగారు నగలు కావాలా ? వెండి నగలు కావాలా ?" అని అడిగింది. రాణి "బంగారు నగలు కావాలి" అంది. ఎద్దు వెండి నగలు ఇచ్చింది. చీమ ఎదురై "పాయసం కావాలా ? అన్నం కావాలా ? అని అడిగింది. "పాయసం కావాలి" అంది రాణి. చీమ అన్నం ఇచ్చింది. మల్లెచెట్టు ఎదురై "పువ్వులు కావాలా ? ఆకులు కావాలా ?" అని అడిగింది. రాణి "పువ్వులు కావాలి" అంది. మల్లె చెట్టు ఆమె తలనిండా ఆకులు పెట్టింది.

అలా చిన్నరాణి రాజు వద్దకు వెళ్ళింది. పిచ్చిదాని మాదిరిగా ఉన్న ఆమెను రాజు తిట్టి పంపించాడు పెద్దరాణి రాజుతో సంతోషంగా జీవించింది. ★

# కాయగూరల కథ



అనగనగా ఒక ఊరు. ఆ ఊరిలో చింతకాయంత చిట్టోడు ఉండేవాడు. ఒకరోజు అతడు బడికి వెళుతుంటే వంకాయంత వజ్రం దొరికింది. దానిని అతడు బీరకాయంత బీరువాలో పెట్టి తాటికాయంత తాళం వేశాడు. తర్వాత మళ్ళీ బడికి వెళ్ళాడు.

అప్పుడు దోసకాయంత దొంగ వచ్చి గరికపోచంత గడ్డపారతో తాటికాయంత తాళాన్ని విరగ్గొట్టాడు. వంకాయంత వజ్రాన్ని ఎత్తుకుపోయాడు. అప్పుడు చింతకాయంత చిట్టోడు దోసకాయంత దొంగను పట్టుకొమ్మని పొట్లకాయంత పోలీసుకు చెప్పాడు. పొట్లకాయంత పోలీసు జీడిగింజంత జీపులో వెళ్ళి దోసకాయంత దొంగను పట్టుకుని అతని దగ్గరి నుంచి వంకాయంత వజ్రాన్ని తీసుకుని అతన్ని జామకాయంత జైల్లో వేశాడు. పొట్లకాయంత పోలీసు మిరపకాయల తొడిమలతో దోసకాయంత దొంగను బాగా కొట్టాడు.

తర్వాత వంకాయంత వజ్రాన్ని చింతకాయంత చిట్టోడికి ఇచ్చి వేశాడు. అప్పుడు చింతకాయంత చిట్టోడు వంకాయంత వజ్రాన్ని ములక్కాయంత ముసలమ్మ దగ్గర దాచి పెట్టాడు.

★

# బంగారు వెంట్రుకల పిల్లవాడు

**ఒక** అడవిలో ఎలుక, ఎలుగుబంటి ఉండేవి. రెండూ కలిసి మొక్కజొన్న చేను వేశాయి. పంట పండాక సమానంగా పంచుకోవాలనుకున్నాయి. కొద్ది రోజులకు పంట ఏపుగా పెరిగింది. ఎలుకకు దురాలోచన కలిగింది. రాత్రిపూట మొక్కజొన్న కంకులన్నీ తెంపి తన కలుగులో దాచివేసింది. మరునాడు ఎలుగుబంటి వచ్చి చూసేసరికి ఒక్క కంకి కూడా కనిపించలేదు.

అప్పుడు ఎలుగుబంటి ఎలుకతో గొడవకు దిగింది. "పంట అంతా నువ్వే కాజేశావు" అంది. "కాదు నువ్వే" అంది ఎలుక. రెండూ వాదులాడుకోసాగాయి. ఆ సమయంలో పదేళ్ళ కుర్రవాడు పశువులు మేపుకుంటున్నాడు. ఎలుక అతన్ని పిలిచింది. "మా ఇద్దరిలో ఎవరు ఎక్కువ కంకులు తింటారు చెప్పు" అని అడిగింది అతన్ని. అందుకా పిల్లవాడు "ఎలుగుబంటి ఎక్కువ కంకులను తింటుంది" అని చెప్పాడు. అప్పుడు ఎలుగుబంటి కోపంతో "నువ్వు కూడా నన్ను మోసం చేయాలని చూస్తున్నావు కదూ ! నిన్ను చంపి నా పగ తీర్చుకుంటాను" అంది.

పిల్లవాడు భయపడిపోయాడు. ఇంటికి పరుగెత్తాడు. వాళ్ళ అమ్మకు విషయం చెప్పాడు. "నువ్వేమీ భయపడకు. మంచంమీద పడుకో. నేను క్రింద పడుకుంటాను" అంది తల్లి. పిల్లవాడు మంచం మీద నిద్రపోయాడు. మంచం ప్రక్కన నేలమీద తల్లి పడుకుంది. అర్ధరాత్రయ్యింది. ఎలుగుబంటి వాళ్ళ ఇంటికి వచ్చింది. పిల్లవాడి మంచం క్రింద దూరింది. మంచంతో సహా





పిల్లవాడిని వీపుమీద వేసుకుని అడవిలోకి బయలుదేరింది. చాలాదూరం వెళ్ళాక పిల్లవాడికి మెలకువ వచ్చింది. ఎలుగుబంటి తనను చంపడానికి తీసుకు వెళ్తుందని అర్థం చేసుకున్నాడు. ఎలుగుబంటి వెంట్రుకలను మంచానికి ముడులు వేయసాగాడు. ఒక పెద్ద మర్రిచెట్టు క్రింద నుండి ఎలుగుబంటి వెళుతుండగా దాని ఊడలు పట్టుకున్నాడు. ఖాళీ మంచంతో ఎలుగుబంటి ఒక పెద్ద బావి వద్దకు వెళ్ళింది. మంచం మీద పిల్లవాడు ఉన్నాడుకుని మంచాన్ని బావిలోకి విసిరింది. దానికి వెంట్రుకలు కట్టి ఉండడంతో మంచంతో సహా బావిలో పడి పోయింది.

మర్రి ఊడలు పట్టుకుని క్రిందికి దిగిన పిల్లవాడికి బాగా ఆకలి వేసింది. ఇంటికి వెళ్ళే దారి మరిచిపోయాడు. దూరంగా కొన్ని కుండలనిండా పాలు పెరుగు కనిపించాయి. అక్కడికి వెళ్ళి ఒక్కో కుండలోంచి కొంత పాలు పెరుగు తీసి తిన్నాడు. ఆకలి తీరాక తిరిగి చెట్టు ఎక్కి కూర్చున్నాడు. కొద్దిసేపటికి ఆ కుండల వద్దకు కొన్ని ఆవులు వచ్చాయి. కుండల్లో కొంత తగ్గి ఉండడం చూశాయి. ఆశ్చర్యపోయాయి. మరునాడు కూడా పిల్లవాడు పాలు, పెరుగు తాగాడు. పాలు, పెరుగు ఎందుకు తగ్గుతున్నాయో తెలుసుకోవాలనుకున్న ఆవులు ఒక దూడను చాటుగా కాపలా ఉంచి వెళ్ళాయి. మూడవనాడు పిల్లవాడు కుండల వద్దకు రాగానే దూడ కేకలు వేసి అన్ని ఆవులను పిలిచింది. అవన్నీ పిల్లవాణ్ని చుట్టుముట్టాయి. "ఎవరు నువ్వు ? ఎందుకు మా పాలు తాగుతున్నావు ?" అని ప్రశ్నించాయి. అప్పుడు పిల్లవాడు తన కథంతా చెప్పాడు. అది విన్న ఆవులు జాలిపడి "ఐతే నువ్వు మాతోనే ఉండిపో. పాలు, పెరుగు తాగి ఆకలి తీర్చుకో" అన్నాయి. పిల్లవాడు ఆవులతో సంతోషంగా గడపసాగాడు.

కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. పిల్లవాడికి ఇరవై సంవత్సరాల వయస్సు వచ్చింది పాలు, పెరుగు తాగడం వల్ల అతని తల వెంట్రుకలు బంగారు రంగులోకి మారిపోయాయి చాలా అందగానిగా తయారయ్యాడు.

ఒకరోజు పిల్లవాడు నదిలో స్నానం చేస్తుండగా ఒక వెంట్రుక రాలి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. రాజుగారి చాకలి ఒకావిడ ఆ నదిలో బట్టలు ఉతుకుతుంది. ఆ వెంట్రుక యువరాణి బట్టలకు అంటుకుంది. యువరాణి బట్టలు ధరిస్తూ ఆ వెంట్రుకను చూసి ఆశ్చర్యపోయింది.

ఆమె తండ్రి ఆమెకు వివాహం చేయాలనుకున్నాడు. "నీ మనసులో ఎవరైనా ఉన్నారా ?" అని అడిగాడు. ఆమె బంగారు వెంట్రుకను చూపించి "ఈ వెంట్రుకలు ఉన్న వ్యక్తినే పెళ్ళి చేసుకుంటాను" అని చెప్పింది. రాజు చాకలి స్త్రీని పిలిచి "ఈ వెంట్రుక ఎక్కడ దుస్తులకు అంటింది" అని అడిగాడు. అందుకు ఆమె "అడవిలో నదిలో బట్టలు ఉతుకుతుండగా అంటి ఉంటుంది. ఆ అడవిలో దూరంగా ఒక మనిషిని కూడా చూశాను" అని చెప్పింది.

రాజు అడవికి వెళ్ళి పిల్లవాడిని కలిశాడు. తన కూతురును వివాహం చేసుకుని తన రాజ్యాన్ని పరిపాలించమన్నాడు. అందుకు పిల్లవాడు "ఆవుల్ని వదిలి రావడం నాకు ఇష్టం లేదు" అన్నాడు. అప్పుడు ఆవులు "నువ్వు పెళ్ళి చేసుకుని హాయిగా బ్రతకాలన్నది మా కోరిక" అన్నాయి. పిల్లవాడు సరేనని రాజుతో బయలుదేరాడు. యువరాణిని పెళ్ళి చేసుకున్నాడు. తన తల్లిదండ్రులను కలుసుకున్నాడు. రాజ్యాన్ని పరిపాలిస్తూ హాయిగా జీవించాడు. ★




# బలహీనుని యుక్తి

ఒక సాలెవాడు తాను నేసిన బట్టకు గంజి పెడుతున్నాడు. కొన్ని ఈగలు పదేపదే వచ్చి ఆ బట్టమీద వాలసాగాయి. ఎన్నిసార్లు తోలినా మళ్ళీ మళ్ళీ వస్తున్నాయి. సాలెవాడు కోపంతో వాటిని చేత్తో చరిచాడు. ఒకే దెబ్బకు పది ఈగలు చచ్చిపడ్డాయి. "నేను ఒక్క దెబ్బకు పది ఈగల్ని చంపాను" అని చెప్పాడు సాలెవాడు మరో వ్యక్తితో. అతడు మరో వ్యక్తికి చెప్పాడు. ఇలా ఈ విషయం బాగా పాకిపోయింది. రాజుకు తెలిసింది.

రాజు ఆసాలెవాడిని పిలిపించాడు. "నువ్వు అంత మొనగాడివైతే మన ఊరి శివాలయంలోకి రోజు ప్రసాదం పెట్టే వేళకు ఒక పెద్దపులి వచ్చి జనాన్ని చంపి తింటుంది. దాన్ని చంపి అందర్నీ కాపాడు" అన్నాడు రాజు. సాలెవానికి భయం వేసింది. కాదంటే రాజు ఏం చేస్తాడోనని కూడా భయపడ్డాడు. సరేనని ఒప్పుకున్నాడు.

మరునాడు సాలెవాడు శివాలయానికి వెళ్ళి కూర్చున్నాడు. ప్రసాదం పెట్టే సమయం అయ్యింది. అప్పుడే పెద్దపులి గాండ్రించుకుంటూ వచ్చింది. సాలెవాడు మొండి ధైర్యంతో పెద్దపులికి ఎదురువెళ్ళాడు. చేతికి అందిన రాళ్ళను తీసి దానిమీదకు విసరడం మొదలుపెట్టాడు. చివరకు పులిని చంపివేశాడు. తాను అలాగే రాజు దగ్గరకు వెళితే నమ్మడేమోనని తన బట్టలు చింపుకొని, ఒళ్ళంతా రక్కుకొని వెళ్ళాడు. "పులితో పోరాటం చేసి చంపాను" అని చెప్పాడు. రాజు చాలా సంతోషించాడు. సాలెవాడిని సైన్యాధిపతిగా నియమించాడు.






ఒకరోజు రాజు మీదికి ప్రక్కరాజ్యం రాజు యుద్ధానికి వచ్చాడు. రాజు సాలెవాడిని పిలిచి సైన్యంతో వెళ్ళి ఓడించి రమ్మని చెప్పాడు. సాలెవాడు తెల్లబట్టలు ధరించి, తెల్లని గుర్రం ఎక్కి కత్తి ధరించి యుద్ధానికి వెళ్లాడు. ఎదురుగా ప్రక్క రాజ్యం సైన్యం నిలబడి ఉంది. సాలెవాడు వెళ్ళే దారిలో దారికి ఇరువైపులా తాళ్ళు కట్టబడి ఉన్నాయి. అవి ఎప్పుడో కట్టబడ్డాయి. ఎండకు వానకు దెబ్బతిని చీకిపోయాయి. సాలెవాడు గుర్రంమీద వస్తూ ఆ రెండు తాళ్ళను పట్టుకున్నాడు. అవి పుటుక్కున తెగిపోయాయి. శత్రురాజు ఇది చూశాడు. సైన్యం లేకుండా ఒక్కడే మనిషి తెల్లబట్టలతో రావడం, తాళ్ళను తెంపడం చూసి ఇతనెవరో మహాబలవంతుడిలా ఉన్నాడు. ఇతనితో యుద్ధం చేస్తే తాను ఓడిపోతానని భయపడ్డాడు. వెంటనే తన సైన్యంతో వెనుదిరిగి వెళ్ళిపోయాడు. సాలెవాడు రాజు వద్దరకు వెళ్ళి శత్రురాజు పారిపోయాడని చెప్పాడు. రాజు సంతోషించి ఆ రాజ్యానికి సాలెవాడిని రాజును చేశాడు. ★

# మంగళం కృష్ణా ! చాకలి కృష్ణా !

**ఒ**క బ్రాహ్మణుడికి ఒక మంగలి, చాకలి పనులు చేసి పెట్టేవారు. మంగలి వారానికొకసారి బ్రాహ్మణునికి క్షవరం చేసేవాడు. చాకలి బ్రాహ్మణుని బట్టలు ఉతికేవాడు. అలా కొన్ని సంవత్సరాల పాటు వాళ్ళు బ్రాహ్మణునికి సేవలు చేశారు. సమాజంలో బ్రాహ్మణునికి మంచి గౌరవం లభించడం తమకు అంతగా లభించకపోవడం గమనించారు.

ఒకరోజు ఇద్దరూ కలుసుకున్నారు "మనమిలా ఎంతకాలం పని చేసినా మనకు మంచి గుర్తింపు రాదు అందుకని మనం కూడా బ్రాహ్మణులుగా మారిపోదాం అనుకున్నారు అనుకున్నదే తడవుగా నున్నగా గుండు గీయించుకున్నారు. విబూదితో బొట్లు పెట్టుకున్నారు. మంచి బట్టలు ధరించారు. మరో ఊరికి పయనమయ్యారు.

వాళ్ళు వెళ్తుంటే దారిలో కొందరు ఎదురయ్యారు. "అయ్యా ! ఈరోజు మా ఇంట్లో శ్రీకృష్ణుని పూజా కార్యక్రమం ఉంది. మీరు బ్రాహ్మణోత్తములు కదా ! మా ఇంటికి దయచేసి మమ్మల్ని ధన్యుల్ని చేయండి" అని వేడుకున్నారు. చాకలి, మంగలి లోలోపల సంతోషపడ్డారు మంచి అవకాశం దొరికిందని సంబరపడ్డారు.





ఇద్దరూ పిలిచిన వాళ్ళ ఇంటికి చేరుకున్నారు. పూజ గదిలో ఇద్దర్నీ పీటల మీద కూర్చోబెట్టారు. ఆ ఇంటివారు పూజ మొదలుపెట్టారు. వాళ్ళిద్దరూ మౌనంగా చూస్తుండిపోయారు. చివరికి పూజ ముగిసింది. ఆడవాళ్ళు దేవునికి హారతి పడుతూ "మంగళం కృష్ణా.. మంగళం కృష్ణా" అని చదవసాగారు. చాలాసేపటి నుంచి ఇదిచూస్తున్న మంగలి చటుక్కున లేచి "ఏమిటండీ ఇది. అప్పట్నుంచి మంగళం కృష్ణా, మంగళం కృష్ణా అంటున్నారేగాని, చాకలి కృష్ణా అనరేం" అన్నాడు కోపంగా. దానికి ఆ ఇంటివాళ్ళు "అలా అనడం మేమెప్పుడూ వినలేదండీ అదేమిటి" అన్నారు ఆశ్చర్యపోతూ. దానికి మంగలి "నేను మంగలి కృష్ణయ్యను, వీడు చాకలి కృష్ణయ్య. మీరేమో నన్నొక్కడినే గుర్తుపట్టినట్లున్నారు" అన్నాడు.


ఇంటివాళ్ళకు వాళ్ళు బ్రాహ్మణులు కారన్న విషయం అర్థమైపోవడంతో ఇద్దరికీ బాగా దేహశుద్ధి చేసి పంపించారు. ★


# ఏడు చేపల కథ

అనగనగా ఒక రాజు  ఆ రాజుకు ఏడుగురు కొడుకులు. ఒకరోజు వాళ్ళు వేటకు వెళ్ళి ఏడు చేపలు తెచ్చారు. వాటిని ఎండబెట్టారు. ఆరు చేపలు ఎండాయి. ఒక చేప ఎండలేదు.

ఆ చేపను “చేపా ! చేపా ! ఎందుకు ఎండలేదు ?” అని అడిగితే అది “నాకు గడ్డిమోపు ఎదురు వచ్చింది.” అని చెప్పింది  గడ్డి మోపును “గడ్డిమోపా ! గడ్డి మోపా ! ఎందుకు ఎదురు వచ్చావు ?” అని అడిగితే “ఆవు నన్ను మేయలేదు” అని చెప్పింది. ఆవును “ఆవూ! ఆవూ! ఎందుకు గడ్డి మేయలేదు” అనడిగితే ఆవు “జీతగాడు నన్ను మేపలేదు” అని చెప్పింది. జీతగాడిని “జీతగాడా ! జీతగాడా ! ఆవునెందుకు మేపలేదు” అని అడిగితే “నన్ను చీమ కుట్టింది” అని చెప్పాడు  చీమతో “చీమా ! చీమా ! ఎందుకు కుట్టావు’ అని అడిగితే అందుకు చీమ “నా బంగారు పుట్టలో వేలు పెడితే నేకుట్టనా మరి !” అని చెప్పింది ★

























# నవరత్న బుక్ హౌస్

డోర్ నెం. 28-22-20, రహిమాన్ వీధి,

అరండల్‌పేట, విజయవాడ - 2.